# పడిలేచిన కెరటం

- గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

**ఆమె వెళ్ళిపోయాకా**,నేనేం రాసానో చూసాను. చదివాను. మళ్ళీ మళ్ళీ చదివాను

అంతే ఒక్కసారి గట్టిగా ఎక్కిళ్ళు పెడతూ ఏడిచేసాను. ఒళ్ళంతా కదిలిపోతోంది,ఆ సంగతి గమనించాను. పెద్ద బాలశిక్ష లోని ఓ పది వాక్యాలు రాయడానికి యెంత కష్టపడ్డాను. ఓ చిన్నపిల్లల పుస్తకం చదివి రాసే స్థాయికి దిగి పోయాను.

ఒకప్పుడు నా తెలివి మీద నాకు,ఇంట్లో వాళ్ళకి,స్కూల్లో వాళ్ళకి,చాలా నమ్మకం. పదో క్లాసులో స్కూలు ఫస్ట్. ఇంటర్ లో మంచి మార్కులు వచ్చాయి. బివిస్సీ మొదటి రెండు సంవత్సరాలు, పాసయ్యాను, కానీ ఫెయిలవలేదు. ఎంసెట్ ఎంట్రెన్స్,మూడుసార్లూ ఎంతో కష్ట పడి రాసాను. రాంకు వచ్చినా మెడిన్ లో సీటు రాలేదు.

నేను పనికి రానిదన్నట్లుగా ఇంట్లో వాళ్ళు  అనుకుంటూంటే నా మీద నాకే నమ్మకం తగ్గిపోసాగింది. నేను మెల్ల మెల్లగా కిందకి వెళ్తున్నాను. ఎందుకు. ఒత్తిడి అని అన్నారు. నిజంగా అదేనా! నేను వేస్ట్ అని నాకే అనిపించేదా. దానికే సూసైడ్ అటెంప్ట్ చేసానా! ఆర్ణవ్ మరణం తో నాలో అలజడి మొదలైందా! అదే డిప్రెషన్ కి దారి తీసిందా ! ఇవన్నీ నేను ఆలోచించదలుచు కోలేదు. గతంతో పని లేదు. దాన్ని పాతి పెట్టాలి. ఇప్పుడు నాకున్నది ఒక్క వర్తమానం ,నా మీద నాకు నమ్మకం

లేచి మొహం కడుక్కుని వచ్చాను . పాటలు  మర్చిపోయాననుకున్నాను. కాని కూనిరాగాలు తీస్తూ పాడుకున్నాను. డిన్నర్ టైము. వెళ్ళాను. అంశుమాన్,షఫీ కనిపించారు. వాళ్లతో పాటల గురించి మాట్లాడాను.  మాట్లాడుకుంటూ మధ్య మధ్య పాడుకుంటూ భోంచేసాం.

ఆ రాత్రి మంచి నిద్ర పట్టింది. పాటలు కావచ్చు, చదివి ,రాసి, గుర్తుపెట్టుకున్నానన్న సంతోషం కావచ్చు.

మెదడుకి, మనసుకి, శరీరానికి మంచి ఎక్సర్ సైజులు, పెయింటింగ్ లు, చదువు, రెగ్యులర్ గా యోగా,తోటపని,ఆటలు చేస్తూ  ఓ రొటీన్ లో పడిపోయాను.

డాక్టరుగారు,నన్ను పొగడారు. కరెక్ట్ గా,సరి అయిన దారిలో వెళ్తున్నానని అన్నారు. భుజంతట్టి, ఇంక కొద్ది రోజులకి నేను మామూలుగా అయిపోతానని అన్నారు. నేను పాత శృతి లాగా అయిపోతానని అన్నారు. ఇదివరకూ లాగే ఉంటానని అన్నారు. నాకు ఆయన  ఆశల దారాలని కలిపించారు. నేను అందుకోడానికి, అల్లడానికి  ప్రయత్నిస్తున్నాను.

నెలలు గడుస్తున్నాయి. నేను రోజు రోజుకి పూర్వశృతిలా అయిపోతున్నాను. చాలా సంతోషంగా ఉంది.

ఇప్పుడు పుస్తకాలే లోకం అయింది. చిన్నపిల్లల పుస్తకాలు అన్నీ చదివేసాను. పేరుకి చిన్నపిల్లలవి కాని,వాటిని ఇదివరకూ చదవలేకపోయాను. ఇప్పుడు మాత్రం నేను బాగా ఎంజాయ్ చేసాను. మంచి నీతి ఉన్నకథలు. చిన్న పిల్లల స్థాయిలో,వాళ్ళ కోసమే  రాసిన ఇంగ్లీష్ పొయెట్రీ క్లాసిక్స్, తెలుగు భాషలోని కవిత్వం, కథలూ ,నవలలు,అన్నీ చదువుతున్నాను, అంతే కాదు చదివినది గుర్తు కూడా ఉంటోంది. గుర్తు పెట్టుకోడానికి ఇదివరకులాగా రాయక్కర్లేదు.

నా మెదడు బాగానే ఉంది. పైగా ఇదివరకూ లాగా కాకుండా, ఓ పుస్తకాన్ని, ఒక్క రోజులో పూర్తి చేస్తున్నాను. మొదలు పెట్టాకా ఆప బుద్ధి కావడం లేదు. పుస్తకం పూర్తి చేయడానికి నేను చూపే ఉత్సాహం ఆనందం దేనితో కూడా పోల్చలేను. ఆ ఆనందం లో ఎవరు కనపడితే వాళ్ళకి, నేను ఈ

పుస్తకాన్ని పూర్తి చేసాను దాన్ని గుర్తు పెట్టుకున్నాను,అని చెప్పాలనిపించింది. కానీ నా ఉద్వేగాన్ని, భావాల్ని, నాలోనే నొక్కి పెట్టాను. నా ఆనందం ఎదుటి వాళ్ళకి అర్థం కాదు. అందులోని డెప్త్ ని అర్థం చేసుకోరు.

ఇప్పుడు ఆ టేబుల్ మీద ఉన్న పుస్తకాలన్నిటిని చదివేయలన్నంత ఉత్సాహం నాలో వచ్చేసింది.

ఇన్నాళ్ళ నా ప్రయాణం ఓ ఎడారిలో సాగింది. ఇప్పుడు దాహం వేస్తున్న నాకు ఒయాసిస్ కనపడినంత సంతోషం, ఆనందం.ఉత్సాహం,అన్నీ కలిపినట్లుగా ఉంది పైగా మందు కూడా,నిశ్శబ్ధంగా అద్భుతాలని, చూపిస్తోంది.

డాక్టరుగారు నన్ను చూడడానికి వచ్చినప్పుడు అడిగారు,

" మీ వాళ్ళని చూస్తావా. వచ్చేవారం వస్తున్నారు " చూస్తాను అని సమాధానం ఇచ్చాను.

ఇన్ని నెలల తర్వాత అమ్మని నాన్నగారిని చూడబోతున్నాను.

" నేను ఈ పుస్తకాలు చదివేసాను.మరి కొన్ని తేగలరా ? "

" అంత కన్నా కావలసినది ఏముంది, సంతోషంగా ఇస్తాను. ఇక్కడే నా రూం లోనే ఉన్నాయి. ఎవరితోనైనా పంపుతాను "

ఇదివరకూ లాగా కాకుండా, ఇప్పుడు అద్దంలో నా మొహం చూసుకుంటున్నాను. ఈ మధ్య నామొహాన్ని తరచూ అద్దంలో నవ్వుతూ చూసుకుంటున్నాను. నాకే ఆశ్చర్యం వేస్తోంది. కళ్ళల్లో ప్రశాంతత, చర్మంలో నిగారింపు, నున్నగా దువ్విన జుట్టు. పాత శృతిని. మునపటి శృతిని. అప్పటి లాగానే ఉన్నాను. ఇప్పుడు థాంక్స్ ఎవరికి చెప్పాలి.?

ముందు అమ్మా వాళ్ళకి. నాలో జరుగుతున్న మార్పులని తొందరగా గమనించారు. రియాక్ట్ అయ్యారు. కూతురు పిచ్చిదైంది అన్న ఇతరుల మాట వినాల్సి వస్తుంది అన్న భయం పెట్టుకోకుండా, సిగ్గు పడకుండా, సంకోచించకుండా , సమాజానికి భయపడకుండా, సరి అయిన ట్రీట్ మెంటుకోసం,సరి అయిన స్పెషలిస్టుల దగ్గరికి తీసుకెళ్ళారు.

ఆ తరవాత డాక్టరు పాల్ గారికి, ఈ ఆక్యుపేషనల్ థెరపీలో ఉంచినందుకు, ఇక్కడ చదవడంలో సహకరించిన పూర్వీ దేశాయి గారికి, నా వ్యక్తిగత విషయాలు అడగకుండా నాతో ఎన్నో విషయాలు పంచుకున్న ఎన్నో విధాలుగా ఎంతో ఉత్సాహపరిచిన నవలల మనిషి ,ఆ ఇద్దరు యువకులు, ఆ వంటల గృహిణి, ఆ సైన్సు చెప్పే ముసలాయనా , నర్సులు అందరికి. థాంక్స్ . మళ్ళీ జీవించి ఉన్నందుకు,ఆ అవకాశం మరోసారి ఇచ్చినందుకు ఆ దేవుడికి థాంక్స్.

నా జీవితం నిస్సారంగా నడుస్తున్నప్పుడు అన్ని విధాలా మోరల్ సపోర్ట్ ఇచ్చారు. నేను మామూలు మనిషిని కావడానికి వీళ్ళు కూడా కారణమే.

ఆ రాత్రి డిన్నర్ టైం లో వాళ్ళిద్దరూ చేరో ఒక చిన్న పాకెట్ నా చేతికిచ్చారు. మనసులోనే ఆనందించాను. వాళ్ళ ముందే ఆ పాకెట్ కి ఉన్న కవర్ ని విప్పాను. రెండు సీడీలు. ఒకటి రవిశంకర్ సితార్ . రెండోది జగ్జిత్ సింగ్ గజల్స్. ఆ ఇద్దరి పేర్లు విన్నాను కానీ, ఇలా సీడీ వేసుకుని ఎప్పుడూ వినలేదు.

ఈ గజల్స్ గురించి ప్రద్యుమ్న నాతో ఎప్పుడూ మాట్లాడే వాడు. ఎన్నో సార్లు,క్లాసులో పాడాడు, పాడిన ప్రతీ గజల్ అర్థం కూడా చెప్పాడు. అలా ఆనాడు పాడిన ఆ గొంతు ఇప్పుడు ఈ గదిలో నాలుగు వైపులా వ్యాపించి చెవుల్లో గింగురు మంటోంది.

నేనేమయ్యానోనని అనుకుంటాడా? ఇంటికి ఫోన్ చేసి ఉంటాడా ? ఎప్పటిలాగా అమ్మ ఏదో చెప్పి ఉంటుందా? నేను ఆలోచించినట్లుగానే తను గూడా నా గురించి ఆలోచిస్తాడా? అసలు ఏం అనుకుంటున్నాడో ? నేను మాయమైపోయాననుకుంటాడా ?

ఆలోచిస్తుంటేనే ఆశ్చర్యంగా ఉంది. ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చాను? ఆఖరికి ఈ మెంటల్ ఆసుపత్రిలో ఉన్నాను. నా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు. ఎన్నోతుఫాన్లు, ఎంతో ప్రశాంతంగా గడిచిపోతున్న జీవితంలో ఎన్నో మార్పులు,ఊహించని మార్పులు, మలుపులు.

నేను వెళ్ళే రోజు దగ్గరికి వస్తోంది. ఏ రోజు అని కచ్చితంగా తెలీదు. ఓ వారం పదిరోజుల్లో అని తెలుస్తోంది. అందుకని అంశుమాన్ ది, షమీ ది పుస్తకాలు చదివాను . ఇచ్చేసాను.

నేను వెళ్ళే సమయం వచ్చింది. ఇప్పుడు నేను ఫ్రీ. సంపూర్ణ ఆరోగ్యవంతురాలిని. జీవితం మీద నమ్మకం. నామీద నాకు నమ్మకం, పూర్తిగా వచ్చింది. మానసికంగా దృఢంగా ఉన్నాను. అన్నీ కూడా ఈ ప్రపంచంలోనే నేర్చుకున్నాను. అయితే ఈ ప్రపంచాన్ని నా వెనకాల వదిలి వెళ్తున్నాను. . కొన్ని వారాలు నెలలు ఇది నా నివాసం అయింది . కానీ ఎవర్నీ ఎప్పటికీ ఇందులో ఉంచుకోరు. నాలాంటి మరొరి కోసం గది ఖాళీ చేసి వెళ్ళాలి.

. " డాక్టరుగారు మీరు నన్ను ఓ మనిషిని చేసారు. నరకంలో మగ్గి పోతున్న నాకు సంతృప్తి ద్వారాలు తెరిచారు. మూసుకుపోయిన జీవితం ఆ తాళం చేతులు నాచేతికిచ్చారు. నాతో తెరిపించారు. " అదే అన్నాను.

దేవుడిని చాలా తక్కువ అంచనా వేసాను. కాని కాదు. దేవుడు నాకు ఎంతో మేలు చేసాడు. ఎన్నో ఇచ్చాడు. నా ఆలోచనలను మార్చాడు. మనసులోనే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

ఆయన నా తల నిమిరారు. మెల్లగా కొట్టారు.

" సంతృప్తి నీకన్నా మాకే ఎక్కువగా ఉంది. నీ కేసుని ఓ ఛాలెంజ్ లాగా తీసుకుని నిన్ను మామూలు మనిషిని చేసాం. ఇంత కన్నా మాకు ఏం కావాలి ? "

" నిజమే మీ అందరికీ ధన్యవాదాలు ఎలా చెప్పుకోనూ. మీ ఋణం ఎలా తీర్చుకోనూ "అన్నాను కళ్ళు తుడుచుకుంటూ.

" అది మాకర్తవ్యం. ఓ పేషెంటుకి వైద్యం చేసి ఆరోగ్యవంతురాలిని చేయడం కోసమే కదా మేమిక్కడ ఉన్నది. మాకూ ఎథిక్స్ ఉంటాయి. ఇక్కడికి వచ్చే వాళ్ళు మామూలు వాళ్ళు కాదు. అందుకని మేము ప్రతీ కేసు ని ఎంతో జాగ్రత్తగా డీల్ చేస్తాము.

కాని మేము నీ కేసుని ఓ ఛాలెంజ్ గా తీసుకున్నాము. నువ్వు నిండా ఇరవై ఏళ్ళు కూడా లేని చిన్నమ్మాయివి. జీవితంలో ఏం అనుభవించావు? ఏమీ లేదు. ఏమీ చూడలేదు. అసలు నీ జీవితం అంతా ముందుంది, అలాంటి నీకు ఇదేంటీ ,మీ వాళ్ళ కన్నా ఎక్కువ బాధ పడ్డాను. నిన్ను ఎలాగైనా మామూలు మనిషిని చేయాలని నేను అనుకున్నాను. దానికి ఇక్కడి వాళ్ళూ, నువ్వు కూడా బాగా సహకరించావు. నీ విల్ పవర్ కూడా ఓ కారణమే "అన్నారు నా తల నిమురుతూ.

" టాబ్లెట్లు రోజుకి ఒక టి చొప్పున రెండు వారాలు వాడాలి. ఆ తర్వాత వారం మానేసి మళ్ళీ అన్నమాట. మందుని పూర్తిగా మానేయద్దు. అలా మానేయడం వల్ల ఇంకా ఎక్కువయ్యే అవకాశాలుఉన్నాయి " అన్నారు.

నాకు తగ్గిపోయింది. నేను నార్మల్ అయిపోయాను. వెళ్తానని తెలిసినప్పటి నుంచి,డాక్టరు గారు, సలహాలు ఇస్తున్నారు.

" శృతీ నువ్వు ఎప్పుడూ ఖాళీగా ఉండకు. అసలు ఆ స్థితిని రానీయకు. నిన్ను నువ్వు తక్కువ అంచనా వేసుకోకు. నీ లోని క్రియేటివ్ ఎనర్జీ పోయింది ఇక్కడే. నీలో చెలరేగే ,అలజడిని అరికట్టాలి అంటే నువ్వు చేసే ప్రతీ పనిలో ఇమ్మర్స్ అయిపోవాలి. లేకపోతే ఇదివరకటిలాగా ఓ రకమైన డిప్రెషన్ లోకి వెళ్ళిపోడానికి అవకాశాలు ఎక్కువ .

గొప్ప గొప్ప విజేతలలో కొందరు ఈ డిప్రెషన్ మూలంగా పిచ్చివాళ్ళుగా మారి పోయిన వాళ్ళూ ఉన్నారు. సంతృప్తి లేదు. అది కావాలి ఇది దొరకాలి,అని, అన్నీ వదిలేసుకుని ,తమకి నచ్చినట్లు , ఇష్టం వచ్చినట్లు తాము జీవించడం అనేది ఆఖరి అన్వేషణ, అదే నిజమైన సంతృప్తి అనుకునే వాళ్ళున్నారు."

అన్నింటికీ తల ఊపుతున్నాను.

" మరోసారి చెప్తున్నాను. నీలో మంచి టాలెంట్ ఉంది. భావుకత ఉంది. దాన్ని వ్యక్తీకరించి, గబగబా రాయగలిగే శక్తి ఉంది. మంచి మంచి రచనలు చేయగలవు. అలాగే పెయింటింగ్. వాటికే నీ సమయాన్ని వినియోగించు.

నీ టాలెంటు నీకు దేవడిచ్చిన వరం. నువ్వు అదృష్టవంతురాలివి. నీ మనసుని వర్తమానంలో ఉంచడం నీకు చాలా అవసరం. గతం అంతా భయంతో,వైఫల్యాలతో ఉంది. అందుకని గతాన్ని తవ్వకు.అటువైపు తొంగి చూడకు. నీకు చెప్పాను కదా మళ్ళీ చెప్తున్నాను,

నీ పది వేళ్ళు నీ స్నేహితులు. అర్థం అయిదా. రచనలు చెయ్యి,బొమ్మలు గియ్యి "అంటూ నవ్వారు. నేనూ నవ్వేసాను.

" డాక్టరు గారూ మీరు రచనలు చెయ్యమని అంటున్నారు,బావుంది,అలా అయితే మొట్ట మొదటగా చిన్నపిల్లల కథే రాస్తాను. దానితోనే మొదలు పెడ్తాను. చిన్నవయసులో చదివిన కథలు పిల్లలని మానసికంగా ఎదగనిస్తాయి. దానికి మీతోనే ముందు మాట రాయిస్తాను. ఎన్నో ఆశలు ,కలలూ ఉన్న ఓ మధ్య తరగతి అమ్మాయి ఓ మెంటల్ ఆసుపత్రి లోకి ఎందుకు వెళ్ళాల్సి వచ్చింది.ఎలా మామూలుగా మారింది. అక్కడి డాక్టర్లు ఎలా సాయ పడ్డారు."

"అంతకంటేనా !".

నేను నవ్వేసాను.ఈ మధ్య నేను నవ్వుతున్నాను.

నవ్వుతే బావుంటానని డాక్టరు గారు అన్నప్పటి నుంచి నవ్వు మొహమే పెడుతున్నాను.

వెళ్ళే ముందు ఏదైనా నా స్నేహితులకి ఇస్తే బావుంటుందనిపించింది. ఎందుకంటే ఇచ్చి పుచ్చుకోడంలో ఉన్న ఆనందం అనుభవించిన దాన్ని కాబట్టి. నేను హైదరాబాదు వచ్చేప్పుడు నా స్నేహితులు నాకు వాళ్ళకి తోచినవి బహుమతిగా ఇచ్చారు. నేను కూడా అంతే. ఇప్పుడు వీళ్ళు నాకు చక్కటి బహుమతులు ఇచ్చారు. వీళ్ళకి కూడా ఏదైనా ఇవ్వాలనిపిస్తోంది.

ఆలోచించాను. ఏం ఇవ్వాలి. నేను నిజంగా ఎప్పుడూ ఇంతల్లాగా ఆలోచించలేదు. కానీ ఇప్పుడు ఆలోచిస్తున్నాను. అసలు ఏం ఇస్తే బావుంటుంది.? ఏదైనా బజారు నుంచి తెచ్చే ఇచ్చే స్థితిలో నేను లేను. అందుకని నేనే ఏదో తయారు చేసి ఇస్తే బావుంటుంది. తయారు చెయ్యడం అంటే నాకున్న లిమిటెడ్ రిసోర్సెస్ నేను ఉపయోగించుకుని నేను ఇవ్వగలిగేది, ,కవితలు. పెయింటింగ్ లు. అవే ఇవ్వడానికి నిశ్చయించుకున్నాను.

ఓ రెండు కవితలు రాసాను. ఇంగ్లీషులో కవితలు ఓ రోజులో రాసేసాను , ఇద్దరు డాక్టర్లకి. అంశుమన్ కి, షమీ కి పెయింటింగ్ లు . అందుకని రెండే రాసాను.

ఇంక పెయింటింగ్ లు. ఏది వెయ్యాలి బాగా ఆలోచించాను. నా దగ్గరున్న పుస్తకాలు చూసాను. చూసి వేయడానికి కావలసినవి కనిపించాయి.

రిక్రియేషన్ రూంకి తొందరగా వెళ్ళి వేయడం మొదలెట్టాను. చిన్నవి అయితే తొందరగా అవుతాయని, చిన్నవే తీసుకున్నాను. నాలుగు వెయ్యడానికి నాలుగు రోజులు పట్టింది.

అన్నిటిని విడివిడిగా, గాలికి ఆర పెట్టాను. అవి ఆరడానికి టైం పట్టింది.

ఇంక తరవాత వాటిని ఎందులో పెట్టి ఇవ్వాలి. కవర్లు అడిగితే ఇస్తారేమో ,కాని అడగదలుచుకో లేదు. రిక్రియేషన్ రూంలో అన్నీ ఉన్నాయి. అక్కడ నుంచి అన్నీ తెచ్చుకుని చేయచ్చు. ఆ ఆలోచన రాగానే కాగితాలు గమ్ బాటిల్ తెచ్చుకుని, తెల్లకవర్లుగా తయారు చేసి అందులో పెట్టాను.

నాకే ఆశ్చర్యంగా ఉంది, నేను ఇంత యాక్టివ్ గా ఉంటానని ఎప్పుడూ అనుకోలేదు.

చదువుకునే రోజుల్లో కూడా నేనింతయాక్టివ్ గాలేను.రెండు కవితలు రాసాను.నాలుగు పెయింటింగ్ లు వేసాను.అది కూడా అతి కొద్ది సమయంలో చేయగలిగాను.

నాకింతకన్నా ఏం కావాలి ? నేను మామూలు మనిషిని అయ్యాను. కవితలని మరోసారి చదవాలని కవర్ లోంచి తీసాను.పైకి చదివాను.

నాకు బాగా లేనప్పుడు సాయం చేసారు.

దారి తప్పి, గుడ్డిదాన్ని అయిపోయినప్పుడు చక్కటి దృష్టి నిచ్చారు

జీవితంలో కిందకి జారిపోతున్నప్పుడు మీరందరూ చేయి అందించి పైకి తెచ్చారు.

మీరు ఓ డాక్టరు కాచ్చు కానీ నాకు మాత్రం ఓ గురువు.

నా గురించి నాకు తెలియచేసారు.

నాకు ఓ జీవితాన్నిచ్చారు. నా జీవితానికి ఓ అర్థం చూపిచారు.

. జీవితానికోగుర్తింపు ఉండాలి.దానికో వెలుగు ,ఆనందంఉండాలి.ఇవన్నీ ముందు ముందు నేను చేయాల్సినవి,నాకు చెప్పకనే చెప్పారు..మీరు నాకు ఓ దేవుడు.నా మనసులోది ఇలా ఆయనకి ఎన్నో ఓ కవితలో రాసాను.

డాక్టరు గారు వచ్చినప్పుడు అది అందించాను".ఏంటిదీ! "అని అంటూనే తెరిచారు.

" నేను మీకు ఎంతో ఋణ పడి ఉన్నాను.జీవితం యొక్క విలువని చూపించారు, బోధించారు. మొదట్లో ఏం చెయ్యాలో తోచక, ఇక్కడ సీనరీలు వేసాను. కాని ఇప్పుడు కాదు. ఈ రెండు నెలలు ఎంతో ఇష్టంగా ,మనసు పెట్టి వేస్తున్నాను. ప్రతీ క్షణం జీవిస్తున్నాను. నేను మీకు ఏది ఇచ్చి ఋణం తీర్చుకో గలను ? ఇది ఓ గొప్ప బహుమతి కాదు, కానీ,దీని కోసం ఎంతో సమయాన్ని, తీసుకున్నాను. నా మనసుని ప్రేమని ఇందులో ఉంచాను." అంటూంటే కళ్ళల్లో నీళ్ళూరాయి.

నేను మాట్లాడున్నంత సమయంలోనే,డాక్టరు గారు పెయింటింగ్ ని చూసారు. కవితని చదివారు. చాలా నిశ్శబ్ధంగా ఉండిపోయారు. కరిగిపోయారనిపించింది. అతని కళ్లల్లో గదిలో వెలుగుతున్న లైట్ల ప్రతిబింబాలు. అది అతని కళ్ళల్లో నిలిచిన నీళ్ళ మూలంగా అని తెలుసు కవితని, పెయింటింగ్ ని తిరిగి కవర్ లో పెట్టెస్తూ, నా మొహం లోకి చూసారు. ఆ కళ్ళల్లో తడి ఇంకా ఉంది. కుడి చేతిని ఛాతిఎడమ వైపు ఉంచి రాసుకున్నారు. కళ్ళు మూసుకున్నారు.

దాని అర్థం నాకు తెలుసు దేవుడి సాయం కావాలని. మానసిక బలం కావాలని.

అంటే నేను వెళ్తూంటే ,బాధ పడుతున్నారు. డాక్టర్లు కూడా సెన్సిటివ్ గా ఉంటారు. బంధాలు పెంచుకంటే తెంపుకోడం చాలా కష్టం అనిపించింది. కొంచెం సేపటికి మామూలు అయ్యారు.

"బ్యూటిఫుల్. మంచి ఎక్స్ ప్రెషన్,రెండూ చాలా బావున్నాయి. వాటిని ఫ్రేము కట్టించి నా క్లినిక్ లో పెట్టుకుంటాను" అని అన్నారు.

"థాంక్యూ" అని అక్కడి నుంచి కదిలాను.

డాక్టరు పూర్వీకి ఇవ్వడానికి బహుమతిని తయారు చేసాను. చేసిన కవరు సైజు సరిపోలేదు. మరో కాగతం తెచ్చి కవరు తయారు చేసే సమయం లేదు..

పోనీ చేద్దామన్నాఅంతకు ముందు తెచ్చిన తెల్ల కాగితాలు అయిపోయాయి. ఓ న్యూస్ పేపరు దొరికింది. అందులో జాగర్తగా పెట్టాను.

డాక్టర్ పూర్వీ దేశాయ్ గారి దగ్గరికి వెళ్తూంటే ఆవిడే దార్లో కనిపించారు. పలకరించాను, చేతిలో ఉన్నది ఆమె చేతిలో ఉంచాను.

ఆవిడ ఆశ్చర్యంగా చూస్తూ ,చేతిలోకి తీసుకుంది.ఏంటిదీ. అంటూ న్యూస్ పేపర్ పక్కకి తొలగించింది. పేయింటింగ్ పైన కవిత ఉన్న కవర్ ఉంది..

ఆవిడ కవిత ఉన్న కవర్ తెరిచారు. చదువు కున్నారు.

" చదువు రాని పిల్లలా ఉన్న నాకు పెద్ద బాలశిక్ష నుంచి మొదలు పెట్టి, నా ఒరిజినల్ లెవెల్ కి తీసుకొచ్చారు. నాకు చదవడం రాయడం మళ్ళీ నేర్పించారు. అక్షరాల , పదాల విలువని చూపించారు. చదవడం రాయడం జీవితానికి ఎలా ఉపయోగ పడతాయో, మానసిక దృఢత్వానికి పుస్తకాలు ఎంత ఉపయోగ పడతాయో ప్రాక్టికల్ గా చూపించారు. అన్న అర్థం ప్రతిబింబించేలా కవిత రాసాను "

నేను వేసిన పెయింటింగ్ తీసి చూసారు.

చీకటిని చీల్చుకుంటూ పైకి వస్తున్న ఎర్రటి సూర్యుడు.

ఆవిడ తడిసిన కళ్ళతో నన్ను చూసారు.బావుందన్నట్లు తల ఊపారు.

" అన్నీ మరిచి పోవడం అంటే చీకట్లో ఉండిపోవడమే కదా డాక్టర్. నేను అందులో మగ్గి పోకుండా
వెలుగుని చూపించారు. అదే ఆ పెయింటింగ్ లో వేసాను "

" నీ గదిలోకి వెళ్దాం.పద " అంటూ భుజం తట్టారు.

డాక్టర్ నా రూముకి వచ్చినప్పుడు,ఆవిడ రెండు చేతులు నా చేతులోకి నా గుండెలకి దగ్గరగా ఉంచాను. ఆవిడ తన చేతుల్ని తీసుకోలేదు.

నాకు దుఃఖం ఆగడం లేదు. ఆమె ఋణం ఎలా తీర్చుకోగలను ? నాకు మరో జన్మనిచ్చారు. మర్చి పోయిన ఎన్నింటినో నేర్పించారు. అని పైకి అంటూంటే ఏడుపు ఆగలేదు. ఆమె చేతుల్ని అలాగే నా కళ్ళకి ఆనించుకున్నాను. కదులుతున్న నా శరీరం చూసి ఆమె నా స్థితిని అర్థం చేసుకుంది. వెంటనే నన్ను తన దగ్గరికి తీసుకుంది. మా మధ్య మాటలు లేవు. దాని అవసరం కూడా లేదు. మౌనమే మాభాష. అక్షరాలు ఎందుకు  అక్కర్లేదు.

ఆమె పేపరుని తప్పించింది."చీకటి లోంచి వెలుగు లోకి.." పెయింటింగ్.

"ఈ సూర్యుడికి అస్తమయం ఉండకూడదు. ఎప్పుడూ వెలుగుతూ ఉండాలి. నలుగురికి ఆ వెలుగులు పంచాలి. చక్కటి దారిని ఎంచుకో. అదే నేను కోరేది "ఆమె కూడా కళ్ళు తుడుచుకుంది.

" ఏడ్పించేసావు శృతీ " అంది నాభుజం తడుతూ.

నిజమే చక్కటి దారిని ఎంచుకోవాలి. వెలుగులు పంచాలి అంటే టీచింగ్ అవుతుందా! లేకపోతే రచనలు చేయడమా

బరువెక్కిన గుండెతో అలాగే ఎంతో సేపు కూచుండి పోయాను.

***(ముగింపు వచ్చేనెలలో)***

Post your comments